

శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జగన్

వైద్య శిబిరాల నిర్వహణ అభినందనీయం

జగద్గిరిగుట్ట : వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని జగద్గిరిగుట్ట కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. పాలాలబస్తీ, మగ్దుంనగర్‌లో ఎస్‌కేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యులు బృందం వంశీ రెడ్డి, బంధవి రెడ్డి, విజయ , శరణ్య, ఉదయ్ నాగేంద్ర, ఆసుపత్రి సిబ్బంది, స్థానిక నాయకులు కొలుకుల జైహింద్, పాపయ్య గౌడ్, వెంకటేశ్, నరసింహారెడ్డి, విఠల్ ముదిరాజ్, దాసు, బ్రహ్మానంద చారి, యాదగిరి, గణేశ్, నాగరాజు, సంపత్ రెడ్డి, రాజేశ్, వినోద్, విగ్నేష్, రాజు పాల్గొన్నారు.

హెచ్‌ఎంటీ పైప్‌లైన్ రోడ్డులోని నర్సరీలో పెంచుతున్న మొక్కలు



‘స్వచ్ఛదనం - పచ్చదనం’కు చకచకా ఏర్పాట్లు

జగద్గిరిగుట్ట: గ్రేటర్‌లో గ్రీనరీ పెంచడమే లక్ష్యంగా ‘స్వచ్ఛదనం – పచ్చదనం’ కార్యక్రమానికి జీహెచ్‌ఎంసీ అధికారులు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 5న న కార్యక్రమం ప్రారంభం కానుండగా 5 రోజుల పాటు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా కూకట్‌పల్లి జోన్‌కు సంబంధించి హెచ్‌ఎంటీ పైప్‌లైన్ రోడ్డులో తొలగించిన డంప్ యార్డ్ స్థలంలో సుమారు 7 ఎకరాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలో పెంచిన సుమారు 9.5 లక్షల మొక్కలను సిద్ధం చేశారు. జోన్ పరిధిలోని కూకట్‌పల్లి, మూసాపేట్, గాజులరామారం, కుత్బుల్లాపూర్, అల్వాల్ సర్కిల్‌లో ఈ మొక్కలు నాటనున్నారు. దీనికి సంబంధించి ఇటీవలే జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. షెడ్యూల్ ప్రకారం అమలు చేయాలని, మొక్కలను ఇంటింటికీ చేరేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కూకట్‌పల్లి జోన్ పరిధిలోని 5 సర్కిల్‌ల్లో మేనేజర్లు, వార్డుకు ఒకరు చొప్పున 22 మంది సూపర్‌వైజర్లు, వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది భాగస్వాములు కానున్నారని, ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ పద్మనాభం తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

జగద్గిరిగుట్ట: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ మైనార్టీ చైర్మన్ జలీల్ ఖాన్ అన్నారు. హెచ్‌ఎంటీ కాలనీలో క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం పెంపొందుతుందన్నారు. ప్రతిభ చూపిన వారికి ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం రోజున మెమెంటోలు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో జలీల్ ఖాన్

సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్యే వివేకానంద్‌కు సమస్యలు వివరిస్తున్న ప్రజలు

కుత్బుల్లాపూర్: ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల ప్రజలు శనివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాలు అందజేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ముగిసిన కట్ట మైసమ్మ వార్షికోత్సవం

కుత్బుల్లాపూర్ : జీడిమెట్ల డివిజన్ పేట్‌బషీరాబాద్ సమీపంలోని కట్ట మైసమ్మ ఆలయ ఆరో వార్షికోత్సవ వేడుకలు శనివారం ముగిశాయి. ఆలయ కమిటీ ప్రతినిధి వివేక్‌రెడ్డి, శైలజ దంపతుల ఆధ్వర్యంలో ఉదయం 7 గంటలకు చండీ నవ వర్ణార్చన, మహా చండీ హవనం నిర్వహించి అష్టభైరవ బలి మహాబలి ప్రదానం చేశారు. చివరిరోజు అవబృత స్నానం, వేద ఆశీర్వచనం, పండిత సత్కారం, తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ప్రతి మంగళవారం మధ్యాహ్నం దాతల సహకారంతో అన్నదానం చేపడుతున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధి వివేక్ రెడ్డి ‘సాక్షి’తో తెలిపారు.



కట్టమైసమ్మ అమ్మవారు



ఆలయ ప్రాంగణంలో అన్నదానం



బోనాలతో వస్తున్న మహిళలు

బస్సు సర్వీసులు పెంచాలని వినతి

జీడిమెట్ల: ఆర్టీసీ బస్సు సర్వీసులు పెంచాలని ఎస్‌ఆర్ నాయక్‌నగర్ బీఆర్‌ఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు జీడిమెట్ల డిపోలో డీఎం ఆంజనేయులుకు శనివారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అపురూపా కాలనీ నుంచి సికింద్రాబాద్ వరకు బస్సు సర్వీసులను పెంచాలన్నారు. అదేవిధంగా ఉదయం జీడిమెట్ల డిపో నుంచి షాపూర్‌నగర్ జగద్గిరిగుట్ట, కూకట్‌పల్లి మీదుగా హైటెక్‌సిటీ వరకు బస్సు నడపాలని కోరారు. దీనికి స్పందించిన డీఎం ఎంక్వైరీ చేసి సర్వీసులను ప్రారంభిస్తామని తెలిపారు. కలిసిన వారిలో బీఆర్‌ఎస్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, హరిబాబు, పూర్ణచంద్రగుప్తా, పి.భాస్కరరెడ్డి తదితరులు ఉన్నారు.



డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

గ్లోబల్ వార్మింగ్ | ముప్పును అరికడదాం

- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్
- ఎమ్మెల్యే వివేకానంద్‌తో కలిసి వన మహోత్సవానికి హాజరు



వన మహోత్సవంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

దుండిగల్: మొక్కల పెంపుతోనే గ్లోబల్ వార్మింగ్ ముప్పును అరికట్టవచ్చని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని భౌరంపేట్ లహరి గ్రీన్ పార్క్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ‘వన మహోత్సవం’కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే వివేకానంద్‌తో కలిసి హాజరై మొక్కలు నాటారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, ప్రజలు చెల్లించిన పన్నులకు కాపాలాదారులు మాత్రమేనని, అన్నీ ప్రజలు కట్టే పన్నులే అయినప్పుడు కేంద్రం, రాష్ట్రాల వాటా అని విడదీయడం ఎందుకుని, కేంద్ర ప్రభుత్వం చేసే పనులు వందశాతం కేంద్రం నిధులతోనే చేపడతామన్నారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో రైల్వే పనులను కేంద్రం నిధులతోనే పూర్తి చేస్తామని హామీనిచ్చారు. ఒకప్పుడు సిటీ ఆఫ్ లేక్స్‌గా ఉన్న హైదరాబాద్ నగరం ప్రస్తుతం మురికి కుంటలకు నిలయంగా మారిందని, దీంతో దోమలు, ఈగలు పెరిగిపోవడంతో ప్రజలు జ్వరాలతో ఆస్పత్రుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వనాలు, చెరువులను కాపాడుకుంటేనే మానవ మనుగడ ఉంటుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వివేకానంద్ తనకు తమ్ముడు లాంటివాడని, తమ మధ్య ఎలాంటి బేషజాలు లేవన్నారు. హైదరాబాద్‌లో సమతుల్య వాతావరణం నెలకొందని, దాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యతని అన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి తన సహకారం ఎప్పుడు ఉంటుందని హామీనిచ్చారు. కార్యక్రమంలో లహరి గ్రీన్ పార్క్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వివేకానంద్‌తో కలిసి మొక్కలు నాటుతున్న ఎంపీ ఈటల

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

కుత్బుల్లాపూర్: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఏసీపీలు శ్రీనివాసులు, వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం పలుచోట్ల డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. బాలానగర్‌లో 21 జీడిమెట్లలో 16 , అల్వాల్‌లో 22 మొత్తం 59 మంది మందుబాబులపై కేసులు నమోదు చేశామని తెలిపారు.

రేపు ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటిషన్

కుత్బుల్లాపూర్: ఈ నెల 5న పీపీఐ ఇంటర్ క్లాస్ ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్ నిర్వహించనున్నట్లు కొంపల్లి శివశివాణి కళాశాల యాజమాన్యం శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. సోమాజిగూడ ఎన్‌ఎస్‌ఆర్ ప్రీ ప్రైమరీ స్కూల్‌లో ఉదయం 9 గంటలకు ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు.

ఆలయాల్లో అన్నదానం

జగద్గిరిగుట్ట: చింతల్, శ్రీసాయికాలనీలోని అభయాంజనేయ, పోచమ్మ ఆలయాల ప్రాంగణంలో శనివారం అన్నదానాలు నిర్వహించారు. హనుమాన్ అన్నప్రసాద సేవా ట్రస్ట్ చైర్మన్ కన్నెకంటి లక్ష్మణ్, ప్రెసిడెంట్ కల్యాణ్ రావు పాటిల్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

కిరాణ దుకాణంలో చోరీ

నిజాంపేట్: దుకాణంలో చోరీకి పాల్పడిన నిందితుడిని బాచుపల్లి పోలీసులు పట్టుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 31న ప్రగతినగర్‌లోని శ్రీసాయివేంకటేశ్వర కిరాణ షాపు షటర్ తొలగించి రూ.10 వేలు, సిగరేట్ డబ్బాలను దొంగిలించడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు శనివారం నిజాంపేట్‌లోని ఓ హోల్ సేల్ సిగరేట్ల దుకాణంలో దొంగిలించిన ప్యాకెట్లను విక్రయించేందుకు యత్నిస్తున్న యువకుడిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా కర్నూలు జిల్లాకు చెందిన ఆంజనేయులుగా గుర్తించారు. అత ని తల్లిదండ్రులు పూల దుకాణం నిర్వహిస్తుండగా వారికి చోదోడుగా ఉంటున్నాడు. అయితే ఇటీవల తాగుడుకు బానిసైన ఆంజనేయులు సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆశతో చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. పోలీసులు నిందితుడి నుంచి రూ.10 వేలు, సిగరేట్ ప్యాకెట్లను స్వాధీ నం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

పాత కక్షలతో ఒకరి హత్య

జీడిమెట్ల: పాత కక్షలతో ఒకరిని హత్యచేసిన ఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ జి.మల్లేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఎస్.కె. ముస్తఫా (38) 20 ఏళ్ల క్రితం నగరానికి వలసవచ్చి కూలీ పనులు చేసుకుంటూ ఫుట్‌పాత్‌లపై జీవిస్తున్నాడు. ముస్తఫాకు గౌస్ అనే వ్యక్తితో స్నేహం ఉండేది, కాగా 2019లో గౌస్ , ముస్తఫాల మధ్య గొడవ జరగగా గౌస్ ముస్తఫాపై దాడిచేశాడు. అప్పట్లో ముస్తఫా ఫిర్యాదు మేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేశారు. కొన్ని రోజుల తర్వాత గౌస్‌కు కోర్టు జైలు శిక్ష విధించింది. 4 నెలల క్రితం గౌస్ జైలు నుంచి విడుదల అయ్యాడు. ఇదిలా ఉండగా శనివారం ఉదయం జీడిమెట్లలోని గ్యాస్ గోదాం ఎదురుగా ముస్తఫా మృతదేహం పడి ఉండడాన్ని ఓ వ్యక్తి గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే వారు ఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు చేసి గౌస్ ఈ దారుణానికి ఒడిగట్టినట్లు గుర్తించారు. మృతుడి సోదరుడు తబసుర్ ఫిర్యాదు మేరకు పోలీసులు గౌస్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

కుత్బుల్లాపూర్: అధికారులు సమన్వయంతో పని చేసి ‘స్వచ్ఛదనం-పచ్చదనం’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్ అన్నారు. ఈ నెల 5 నుండి 9వ తేదీ వరకు నిర్వహించనున్న కార్యక్రమాల నేపథ్యంలో కౌన్సిల్ సభ్యులు, వార్డు అధికారులతో శనివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వార్డులో తాగునీటి సరఫరా, ఇంకుడు గుంతల నిర్మాణం, డ్రైనేజీలు, నీటి నిల్వ ప్రాంతాలను శుభ్రం చేయడం, గుంతలు పూడ్చడం చేపట్టాలన్నారు. అదేవిధంగా సీజనల్ వ్యాధుల నివారణకు ప్రజల్లో అవగాహన, వీధి కుక్కల దాడుల నివారణ చర్యలు, డ్రై డే.. ఫ్రై డే కార్యక్రమంలో ప్రభుత్వ సంస్థలను శుభ్రం చేయడం , ప్రతి వార్డుల్లో మొక్కలు పంపిణీ చేయడం వంటి కార్యక్రమల్లో ఆయా శాఖల అధికారులు, ప్రజలను భాగస్వాములు చేయాలన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ రత్లవత్ గంగయ్య, స్వచ్ఛదనం- పచ్చదనం ప్రత్యేకాధికారి కే వెంకటేశం, మున్సిపల్ కమిషనర్ శ్రీహరి గారు, మేనేజర్ వెంకటేశం, వార్డ్ ఆఫీసర్లు, కౌన్సిలర్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కొంపల్లి మున్సిపల్ చైర్మన్ శ్రీశైలంయాదవ్

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్‌తో సభ్యులు

నిజాంపేట్: సంక్షేమ సంఘాలు అభివృద్ధి పనుల్లో భాగస్వాములు కావాలని నిజాంపేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్ అన్నారు. బాచుపల్లి శ్రీహోమ్స్ కాలనీ యూత్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు డిప్యూటీ మేయర్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కాలనీ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని హామీనిచ్చారు. కలిసిన వారిలో అధ్యక్షుడు రామోజీ రావు, గౌరవ అధ్యక్షుడు తాళ్లూరి ప్రదీప్, ఉపాధ్యక్షుడు రాజేశ్ చౌదరి, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి రాఘవేందర్ రెడ్డి, కోశాధికారి కిరణ్, సంయుక్త కోశాధికారి శశి భూషణ్, కల్చర్-స్పోర్ట్స్ సభ్యుడు రజినీకాంత్, అనిల్ కుమార్, హర్ష, శ్రీకాంత్ రెడ్డి, మాధవ్, సీనియర్ అడ్వైజర్ వెంకటేశ్వర రావు తదితరులు ఉన్నారు.

చీపురు పట్టి.. శుభ్రం చేసి

కుత్బుల్లాపూర్: ఎన్‌ఎస్‌యూఐ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కూన రాఘవేంద్ర గౌడ్ ఇటీవల షాపూర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో నోట్ బుక్కులు పంపిణీ చేశారు. అదే సమయంలో మూత్రశాలలు అధ్వానంగా ఉండడం చూసి చలించిపోయాడు. మరమ్మతులు చేపట్టాలని సిద్ధమై అనుకున్నదే తడవుగా స్థానికులతో కలిసి శుక్ర, శనివారాల్లో మూత్రశాలలను శుభ్రం చేసి సున్నాలు వేయించారు. సంజయ్ గాంధీనగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు భద్రప్ప, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ సుజాత రెడ్డి, కాంగ్రెస్ నాయకులు జగన్, సతీశ్, దిలీప్, రజాక్ తదితరులు చీపుర్లు పట్టుకుని.. వాటర్ పైప్ ద్వారా వాటిని శుభ్రం చేయడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మూత్రశాలను శుభ్రం చేస్తున్న కూన రాఘవేంద్ర గౌడ్, ప్రతినిధులు

స్నేహితుల దినోత్సవం

కుత్బుల్లాపూర్: చింతల్ వేంకటేశ్వరనగర్‌లోని బచ్‌పన్ ప్లే స్కూల్‌లో శనివారం అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రీ ప్రైమరీ చిన్నారులు ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు కట్టుకుని శుభకాంక్షలు తెలియజేసుకున్నారు. స్నేహం గొప్పతనాన్ని చాటేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని పాఠశాల చైర్మన్ కోటిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు కట్టుకుంటున్న చిన్నారులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చింతల్: అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ బోయిన్‌పల్లి సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ లిమిటెడ్ సీబీడీ-సిటీ సర్కిల్-4 పరిధిలో విద్యుత్ లైన్ మరమ్మతులు, ఏబీ శిష్యుల మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డివిజనల్ అధికారి భిక్షపతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ ప్రాగ టూల్స్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఎల్‌అండ్‌టీ ఫీడర్ పరిధిలో ఉదయం10 నుంచి 11:30 గంటల వరకు గాంధీనగర్, ఎల్ అండ్‌టీ, వెంకటేశ్వర స్కై టవర్స్, ఆస్ బెస్టాస్ హిల్స్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి ఒకటిన్నర వరకు ఏబీ కాలనీ, రసూల్ ఫీడర్, ప్రగతి ప్యాక్, జీహెచ్‌ఎంసీ పార్క్, ఏబీ కాలనీ కమ్యూనిటీ హాల్, లాస్ట్ బస్టాప్ మస్జిద్, రాజ్ ఫుడ్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు రంగారెడ్డినగర్, రాజ్ ఫుడ్స్, టిక్నో ఎలక్ట్రికల్స్, బాలాజీ ఎలక్ట్రికల్స్ తదితర ప్రాంతాల్లోని పరిశ్రమలు, బస్తీలు, కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

దోమల నివారణ మందు పిచికారీ



డ్రోన్‌తో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

నిజాంపేట్: ప్రగతినగర్‌లోని అంబీర్ చెరువులో దోమల నివారణకు కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. దోమలు విపరీతంగా పెరిగి స్థానికులు విషజ్వరాలు బారిన పడుతున్నారని ఫిర్యాదులు రావడంతో డ్రోన్ సహాయంతో శనివారం దోమల నివారణ మందును చెరువులో పిచికారీ చేశారు. దీంతో చెరువు చుట్టు పక్కల ప్రాంతాల కాలనీల వాసులు హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా గుర్రపు డెక్కను సైతం తొలగించాలని కోరారు.

కార్మికుల అభ్యున్నతికి కృషి

సుభాష్‌నగర్: కార్మికులకు ఏ ఆపద వచ్చిన అండగా ఉండి వారి అభ్యున్నతికి కృషి చేస్తానని టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. గాంధీనగర్‌కు చెందిన యూరోప్లెక్స్ ట్రాన్స్ మిషన్ కంపెనీ యూనియన్ నూతన కమిటీ సభ్యులు శనివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సభ్యులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికులు ఐక్యంగా ఉంటూ సంస్థ అభివృద్ధికి పాటు పడాలన్నారు. ఏరోప్లెక్స్ ట్రాని వర్కింగ్ యూనియన్ జనరల్ సెక్రెటరీ ఆంజనేయరెడ్డి, కృష్ణారెడ్డి, విజయ్‌కుమార్, సత్యనారాయణ, నాగరాజు, గురుమూర్తి, సుధాకర్ రెడ్డి ఉన్నారు.

కేబినెట్ కమిటీ ఎంపిక

చింతల్: చింతల్ బ్రాంచ్ శ్రీ చైతన్య స్కూల్ కేబినెట్ కమిటీని ఎంపిక చేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ భార్గవి పేర్కొన్నారు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అసిస్టెంట్ కోఆర్డినేటర్ వెంకట శివ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేబినెట్ ఎన్నికల్లో పాఠశాల హెడ్ బాయ్, హెడ్‌గర్ల్, స్పోర్ట్స్ కెప్టెన్, సీసీఏ కెప్టెన్, హౌస్ కెప్టెన్, వైస్ కెప్టెన్‌కు ఎన్నికలు నిర్వహించగా ఉపాధ్యాయులు, విద్యార్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. హెడ్‌బాయ్‌గా అక్షయ్, హెడ్ గర్ల్‌గా అక్షయ, డిప్యూటీ హెడ్‌బాయ్‌గా మిథున్, డిప్యూటీ హెడ్ గర్ల్‌గా యుక్త, సీసీఏ కెప్టెన్‌గా వర్షిని, స్పోర్ట్స్ కెప్టెన్‌గా సీహెచ్ వరుణ్ గెలుపొందారని అసిస్టెంట్ కోఆర్డినేటర్ వెంకట శివ తెలిపారు. కార్యక్రమంలో ఏజీఎం శివరామకృష్ణ, రీజినల్ ఇన్‌చార్జిలు పద్మజ, ఏఓ శ్రీనివాస్ రెడ్డి, డీన్ ప్రసాద్, అసిస్టెంట్ డీన్ సురేశ్, సీ బ్యాచ్ ఇన్‌చార్జి రమేశ్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ వెంకట శివ, పీఈటీ చందు, కీర్తన, పాఠశాల సిబ్బంది తదితరులు విద్యార్థులను అభినందించారు.

చోరీ కేసు నిందితుల రిమాండ్

నిజాంపేట్: అద్దెకు ఉంటున్న ఇంట్లోనే చోరీకి పాల్పడిన వదిన, మరిదిని బాచుపల్లి పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట్ జర్నలిస్టుకాలనీకి చెందిన వెంకట్ రావు తన భార్య రాజ్యలక్ష్మి ఈ నెల 26న బీరువాలోని నగదును తీసుకునేందుకు తెరిచి చూడగా అందులోని 20 తులాల బంగారు ఆభరణాలు, రూ.90 వేలు కనిపించలేదు. దీంతో బాధితులు బాచుపల్లి పోలీసులను ఆశ్రయించారు. దీంతో ఇన్‌స్పెక్టర్ ఉపేందర్‌రావు, డీఐ తిమ్మప్ప, క్రైం టీమ్ సభ్యులు దర్యాప్తు చేపట్టారు. నిందితులను పట్టుకునేందుకు ప్రగతినగర్‌లోని బంగారు దుకాణాల వద్ద శనివారం పోలీసులు మాటు వేశారు. ఉదయం 10 గంటల ప్రాంతంలో చేతిలో బ్యాగ్ పట్టుకుని ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా వస్తుండగా వారిని అదుపులోకి తీసుకుని బ్యాగ్‌ను పరిశీలించగా బంగారు నగలు బయటపడ్డాయి. వారిని ప్రశ్నించగా పొంతన లేని సమాధానాలు చెప్పడంతో స్టేషన్‌కు తరలించి తమదైనశైలిలో విచారించగా చోరీ విషయం వెలుగులోకి వచ్చింది. దొంగతనానికి పాల్పడిన బడుగు జ్యోతి (27) కుటుంబం రెండేళ్లుగా రాజ్యలక్ష్మి, వెంకటరావు ఇంట్లో అద్దెకు ఉంటోంది. నిందితురాలు రాజ్యలక్ష్మితో సన్నిహితంగా ఉంటూ బంగారు నగలు ఎక్కడ దాచి పెట్టారన్న విషయాన్ని గమనించింది. వాటిని ఎత్తుకెళ్లి తమ అప్పు తీర్చుకోవాలని పన్నాగం వేసింది. అనుకున్నదే తడవుగా తన మరిది జంపని చైతన్యకుమార్(22)తో కలిసి ఇంటి మారు తాళం చేయించింది. గత నెల 26న ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని 20 తులాల బంగారు నగలు, రూ. 90 వేలను ఎత్తుకెళ్లింది. వాటిని ప్రగతినగర్‌లోని బంగారు దుకాణంలో విక్రయించేందుకు యత్నిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. వారి నుంచి 20 తులాల బంగారు నగలను స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితులను రిమాండ్‌కు తరలించారు.

బాధ్యతల స్వీకరణ

చింతల్: కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ కార్యాలయంలో సీనియర్ ఆఫీసర్‌గా అశోక్ కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన విజయరాధిక ఖైరతాబాద్ జలమండలి ప్రధాన కార్యాలయానికి బదిలీ కాగా, ఎస్‌ఆర్ నగర్ (డివిజన్-6) నుంచి అశోక్ కుమార్ కుత్బుల్లాపూర్ (డివిజన్-12) కు ట్రాన్స్‌ఫర్‌పై వచ్చారు.

డ్రగ్స్ రహిత సమాజానికి సహకరించాలి



మాట్లాడుతున్న డీసీపీ సురేశ్ కుమార్



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, యువత

జగద్గిరిగుట్ట: డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతిఒక్కరూ సహకరించాలని బాలానగర్ డీసీపీ సురేశ్ కుమార్ అన్నారు. వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, యువకులతో కలిసి వీధుల్లో శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం జగద్గిరిగుట్ట ఆర్యవైశ్య భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పిల్లలు వ్యసనాలకు బానిస కాకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనే ఉందన్నారు. ఉపాధ్యాయులు కూడా పిల్లల నడవడికను ఎప్పటికప్పుడు పేరెంట్స్‌కు తెలియజేయాలని సూచించారు. ఎలాంటి అనుమానం ఉన్న పోలీసులకు సమాచారం ఇవ్వాలని, లేదా 8712671111, 14446 లేదా 100 నంబర్లకు ఫోన్ చేయవచ్చన్నారు. అలాగే యాంటీ డ్రగ్ కమిటీ ఎస్‌ఐ శంకర్ 8712568311 నంబర్‌కు కూడా సమాచారం అందించవచ్చని తెలిపారు. అనంతరం డ్రగ్స్ నిర్మూలనకు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీసీపీతో పాటు ఏసీపీ హన్మంత రావు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.